సాక్షి
వికారాబాద్

సోమవారం । 17 । జూన్ । 2024



నీరొస్తే ఒట్టు

కోట్‌పల్లి ప్రాజెక్టు పునర్నిర్మాణ పనుల కోసం అన్నదాతలు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. 8లో▸



బక్రీద్‌కు సిద్ధమైన ఈద్గాలు

ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే పండుగలలో బక్రీద్ ఒకటి. ఈ పండుగను త్యాగానికి ప్రతీకగా భావిస్తారు. 8లో▸



ఇంటర్ కల.. నెరవేరిన వేళ

పేద విద్యార్థులకు విద్యను అందించాలని గతేడాది దౌల్తాబాద్‌కు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేశారు. 9లో▸

న్యూస్‌రీల్

కోటపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నారాయణరెడ్డి



పెద్దేముల్: కోటపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా మంబాపూర్ గ్రామానికి చెందిన రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ నారాయణరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసిందని అగ్రికల్చర్ కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ అధికారులు వెల్లడించారు. చైర్మన్‌గా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అంజయ్యతో పాటుగా మరో 16 మంది డైరెక్టర్లను నియమిస్తున్నట్లు తెలిపారు.

మైసిగండి మైసమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకున్న సర్వేశ్వర్‌రెడ్డి

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవతను ఆదివారం రాష్ట్ర గిరిజన సంక్షేమాభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఏటీడీవో వెంకటయ్య, వసతిగృహ సంక్షేమ అధికారులు రాములు, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు న్యాయం

సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్‌పార్టీ పాలనలోనే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనను సత్కరించారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గంలో నైతిక విజయం తనదేనని అన్నారు. కేంద్రంలో బీజేపీని ప్రజలు తిరస్కరించారన్నారు. ఆ పార్టీ 400 సీట్లు వస్తాయని ప్రచారం చేసుకుందని కానీ ప్రజలు మాత్రం 200పై చిలుకు మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీని విశ్వసించినందునే ఇండియా కూటమికి అధిక సీట్లు ఇచ్చారని పేర్కొన్నారు. దేశ ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన సాగిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేసి తీరుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15లోపు రుణమాఫీ చేయాలి

మొయినాబాద్: ఆగస్టు 15లోపు ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మొయినాబాద్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) మండల కౌన్సిల్ సమావేశం ఆదివారం మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ప్రమాణం చేశారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని.. జీఓ నంబర్ 1కి విరుద్ధంగా పాఠశాలల్లో పుస్తకాలు అమ్ముతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ఆలాంటి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీని బలోపేతం చేసి ప్రజా సంఘాల నిర్మాణం చేపట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీలో ఉండాలన్నారు. అజీజ్‌నగర్‌లో ఏఐటీయూసీ జెండాను కూల్చిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మండల కార్యదర్శి ప్రభాకర్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వడ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తున్న యువత

• సండే సందడి

కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. పరిసర జిల్లాలు, పక్క రాష్ట్రాల నుంచి వచ్చి ప్రాజెక్టు అందాలు తిలకించారు. యువత బోటింగ్‌తో సందడి చేశారు. చిన్నారుల తల్లిదండ్రులు పిల్లలను ఆడిస్తూ ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. తినుబండారాలు ఆరగించి సాయంత్రం వెనుదిరిగారు. – ధారూరు



చిన్నారి ఫొటో తీస్తున్న తల్లి

తొలకరి కలవరం

వరుణుడు కరుణించక రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా చిరుజల్లులే కురుస్తుండడంతో దిగాలు చెందుతున్నారు. తొలకరి పలకరింపునకు ఆకాశంవైపు చూస్తున్నాడు.

జాడలేని వర్షాలు

- అదును కోసం అన్నదాత ఎదురుచూపులు
- దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్న రైతులు
- ఇప్పటికే విత్తనాలు వేసిన వారు ఆందోళన



విత్తనాలు వేస్తున్న రైతు

వికారాబాద్: వానాకాలం సీజన్ ప్రారంభమై 20 రోజులు దాటినా చినుకు కోసం రైతన్న ఆకాశం దిక్కు చూడాల్సి వస్తోంది. వర్షాకాలం ప్రారంభమయింది మొదలు ఇప్పటికీ ఒక్క పెద్ద వర్షం రాకపోవడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. వారం రోజులుగా మేఘాలు ఊరిస్తున్నా చిరుజల్లులకే పరిమితమవుతోంది. పూర్తి స్థాయిలో విత్తనాలు విత్తుకునేందుకు సరిపడా వర్షం కురవటంలేదు. ఇప్పటికే రైతులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 5.90లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేయనున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. 60 మిల్లీ మీటర్ల వరకు రెండు మూడు వర్షాలు కురిస్తేనే విత్తనాలు పూర్తి స్థాయిలో వేసుకునేందుకు అదునవుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. పూర్తిస్థాయి వర్షం ఇప్పటి వరకు పడలేదని అదును అయ్యే వరకు విత్తనాలు వేయకపోవడమే మేలని అధికారులు సూచిస్తున్నారు. అక్కడక్కడ కురిసిన వర్షాలకు 40శాతం విత్తనాలు విత్తుకున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది.

జిల్లాలో మొత్తం 5.90 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. 16 రకాల పంటలు సాగు చేస్తుండగా ఇందులో సింహ భాగం పత్తి, కంది, మొక్కజొన్న, వరి పంటలు సాగుచేయనున్నారు. గతేడాది పత్తి క్వింటాల్‌కు రూ.8వేలకు పైగా ధర పలకడంతో రైతులు ఈ ఏడాది

తగ్గనున్న కూరగాయల సాగు

పత్తి సాగుకు మొగ్గు చూపుతున్నారు. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 2.5లక్షల ఎకరాలు కాగా ఈ ఏడాది మించనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వరి, కంది పంటలు సైతం పెరిగే అవకాశం ఉందంటున్నారు. అయితే కోతుల బెడదతో కూరగాయలు, వేరుశనగ సాగు విస్తీర్ణం ఈ సారి మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు.

విత్తనాలు కొందరివి ఇళ్లలో.. మరికొందరు పొలంలో..

సాధారణంగా ముందస్తు వర్షాలకు రోహిణి.. లేదంటే మృగశిర కార్తెలో వానాకాలం విత్తనాలు ప్రారంభమవుతాయి. సీజన్ ప్రారంభమై 20 రోజులు దాటింది. మృగశిర కార్తె సగానికి వచ్చింది. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు కొందరు ధైర్యం చేసి విత్తనాలు విత్తినా అవి మొలకెత్తుతాయా లేదా అనే ఆందోళన కనిపిస్తోంది. మరో 15 రోజులు ఇలానే కొనసాగితే పెసర, మినుము, జొన్న విత్తు కోవడం కష్టమేనని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అదును దాటకముందే వర్షాలు కురియాలని రైతులు వరుణుడిని వేడుకుంటున్నారు.

లోటు వర్షపాతం



సీజన్ ఆరంభంలోనే రైతుల ఎరువులు, విత్తనాల సమస్య తలెత్తకుండా అందుబాటులో ఉంచాం. నకిలీ విత్తనాల బారిన పడకుండా దాడులు నిర్వహించడంతో పాటు అవగాహన కల్పించాం. లోటు వర్షపాతం కారణంగా ఇంకా విత్తనాలు వేయడం పూర్తి కాలేదు. వర్షాలు పూర్తి స్థాయిలో కురిసే వరకు విత్తనాలు విత్తుకోవద్దు. ఈ నెలాఖరు వరకు అన్ని రకాల విత్తనాలు విత్తుకోవచ్చు. జూన్ దాటితే పెసర, మినుము, జొన్న విత్తనాలు విత్తుకోకపోవటమే మేలు.

– గోపాల్, డీఏఓ, వికారాబాద్

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్

- ప్రతీక్‌జైన్‌ను కలిసిన జిల్లా అధికారులు
- నల్లగొండకు బదిలీ అయిన కలెక్టర్ నారాయణరెడ్డికి వీడ్కోలు

వికారాబాద్: జిల్లా నూతన కలెక్టర్‌గా ప్రతీక్‌జైన్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి నల్లగొండకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రతీక్‌జైన్ ఐఏఎస్‌ను వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. కాగా ఆదివారం నారాయణరెడ్డి ఐఏఎస్ నుంచి ప్రతీక్‌జైన్ బాధ్యతలు స్వీకరించారు. హాజరైన జిల్లా అధికారులు నారాయణరెడ్డికి ఆత్మీయ వీడ్కోలు పలుకుతూ.. నూతన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు. అనంతరం నారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు జిల్లా అధికారులను పరిచయం చేశారు. 17 నెలల పాటు సమర్థవంతంగా జిల్లాలో సేవలందించటానికి సహకరించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, జిల్లా ప్రజలకు నారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్‌గా మొదటి బాధ్యత

2017 బ్యాచ్‌కు చెందిన ప్రతీక్‌జైన్ ఐఏఎస్ వివిధ హోదాల్లో పనిచేసి కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆయన తొలిసారి వికారాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. దేశ రాజధాని ఢిల్లీ పుట్టి పెరిగిన ఆయన విద్యాభ్యాసం అక్కడే పూర్తి చేశారు. 2009–2013 మధ్య గౌహతిలో ఐఐటీ, 2017–19 వరకు జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేటివ్ కోర్సు చదివారు. 2017లో ఐఏఎస్‌గా ఎంపికైన ఆయన 2018–19 వరకు తెలంగాణాలో ట్రైనీ కలెక్టర్‌గా పని చేశారు. 2019 జూలై నుంచి 2019 అక్టోబర్ వరకు జలశక్తి మినిస్ట్రీస్‌లో అడిషనల్ సెక్రెటరీగా విధులు నిర్వహించారు. అనంతరం ఏడాది పాటు రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా పని చేసి అక్కడ నుంచి భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా శనివారం కలెక్టర్‌గా పదోన్నతి పొందే వరకు బాధ్యతలు నిర్వహించారు.

జిల్లా అభివృద్ధికి కృషి

కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రతీక్ జైన్ మీడియా, జిల్లా అధికారులతో కాసేపు మాట్లాడారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. తనకు పదోన్నతి కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వానికి ఆయన ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా అధికారులు పల్వాన్‌కుమార్, రేణుక, జ్ఞానేశ్వర్, మల్లేశం, రాజేశ్వర్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



నారాయణరెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రతీక్‌జైన్



అభివాదం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కార్మికుల హక్కులకు పోరాటం

- ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు

తాండూరు: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో ఏఐటీయూసీ వికారాబాద్ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం సంఘం వందేళ్లుగా పోరాటాలు చేస్తోందన్నారు. కొత్త చట్టాల అమలులో కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రభుత్వాలు నాలుగు కోడ్‌లు అమలు చేసి కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సీసీఐ కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ చెల్లింపుల విషయంలో యాజమాన్యాలే బాధ్యత వహించాలన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నా రు. జిల్లా అధ్యక్షురాలిగా విజయలక్ష్మిపండిత్, గౌరవ అధ్యక్షుడిగా బాలశంకర్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, ఉపాధ్యక్షులుగా హేమంత్‌కుమార్, వంశీకృష్ణ, వెంకటేశ్, కార్యదర్శులుగా పరశురాం, దస్త ప్ప, అశోక్, భూపతి ఎన్నికయ్యారు. ఈ కార్యక్ర మంలో కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రయ్య, కార్యదర్శి విలాస్ తదితరులు పాల్గొన్నారు.

షాట్‌పుట్‌లో సాయికిరణ్ సత్తా

- జాతీయ స్థాయిలో తెలంగాణకు గోల్డ్‌మెడల్
- 18.36 మీటర్ల దూరం విసిరి దేశంలోనే ప్రథముడిగా హస్నాబాద్ యువకుడి రికార్డు

దుద్యాల్: జాతీయ స్థాయి షాట్‌పుట్ విభాగంలో మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన అల్వాల్ సాయి కిరణ్‌కు బంగారు పతకం సాధించాడు. ఈ నెల 15 నుంచి 17 వరకు ఛత్తీస్‌గఢ్‌లో షాట్‌పుట్ విభాగంలో నేషనల్ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత నరగారి రమేశ్ ఆరు నెలలుగా శిక్షణ ఇచ్చి తెలంగాణ తరుపున సాయికిరణ్‌ను ఈ పోటీలకు తీసుకెళ్లాడు. 29 రాష్ట్రాల నుంచి పాల్గొన్న క్రీడాకారులకు శనివారం క్వాలిఫికేషన్ రౌండ్ నిర్వహించారు. ఇందులో తొలి 12 మంది ఆటగాళ్లను ఫైనల్ రౌండ్‌కు ఎంపిక చేశారు. ఆదివారం నిర్వహించిన ఫైనల్ రౌండ్ ఐదు కేజీల షాట్‌పుట్‌ను 18.36 మీటర్ల దూరం విసిరి దేశంలోనే ప్రథముడిగా నిలిచాడు. దీంతో మన రాష్ట్రానికి మొదటి బహుమతి వరించింది. గోల్డ్‌మెడల్ సాధించిన అల్వాల్ సాయి కిరణ్ 'సాక్షి'తో మాట్లాడుతూ దేశంలో మొదటి స్థానం దక్కడం ఆనందంగా ఉందన్నారు. రెండు, మూడు స్థానాల్లో ఒడిశా, ఢిల్లీలు నిలిచాయని చెప్పారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సాయి కిరణ్‌ను బంగారు పతకంతో సత్కరించింది.



చేతులెత్తి విజయ సంకేతం చూపుతున్న సాయి కిరణ్

మరిన్ని విజయాలే లక్ష్యం

ఈ విజయం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం, నా కోచ్ నరగారి రమేశ్ నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఈ ఘనత సాధించాను. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి ప్రోత్సహిస్తే ప్రపంచ స్థాయిలో పాల్గొని దేశానికి మరిన్ని విజయాలు సాధిస్తాను. నన్ను ప్రోత్సహించిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటాను.

– అల్వాల్ సాయి కిరణ్, షాట్‌పుట్ క్రీడాకారుడు

ఆనందంలో కుటుంబ సభ్యులు..స్నేహితులు..

షాట్‌పుట్ విభాగంలో దేశంలోనే ప్రథమ స్థానం పొంది..బంగారు పథకం సాధించిన అల్వాల్ సాయి కిరణ్‌కు గ్రామస్తులు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. తమ కొడుకు దేశంలోనే ప్రథమ స్థానంగా నిలవడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. స్నేహితులు సైతం తమ కిరణ్ విజయం పట్ల సంబురాలు చేసుకుంటున్నారు.

స్థానికేతర రగడ

విద్యాశాఖలో డిప్యుటేషన్ల లొల్లి

- బదిలీలు, పదోన్నతుల్లో స్థానికులకు అన్యాయం
- నిరుద్యోగులకు ఏళ్లుగా తప్పని నిరీక్షణ
- టీచర్ పోస్టుల భర్తీ కోసం ఎదురుచూపు
- ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమైన ఉపాధ్యాయులు, నిరుద్యోగులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా విద్యాశాఖలో డిప్యుటేషన్ల రగడ మళ్లీ మొదలైంది. స్థానికత, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు విరుద్ధంగా అడ్డదారుల్లో వచ్చిన కొంతమంది ఉపాధ్యాయులు ఏళ్లుగా ఇక్కడే తిష్ట వేశారు. పదోన్నతులు, బదిలీల్లోనే కాదు.. ఖాళీ పోస్టుల భర్తీ విషయంలోనూ స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశం లేకుండా చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు అవకాశం కల్పించింది. కోర్టు కేసులు, ఇతర వివాదాల కారణంగా జిల్లాలో ఆ అవకాశం కల్పించలేదు. దీంతో ఇటు ఉపాధ్యాయులు, అటు నిరుద్యోగులు స్థానికేతర అంశంపై ఉద్యమ బాటపట్టేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో 1,263 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో ప్రస్తుతం ఆరువేల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరిలో 4,722 మందికిపైగా ఏళ్ల తబడి ఒకేచోట పని చేస్తున్నట్లు సమాచారం. వీరంతా ఇప్పటికే బదిలీ కోసం దరఖాస్తు కూడా చేసుకున్నారు. కోర్టు కేసు కారణంగా ప్రస్తుతం ఈ ప్రక్రియ కూడా మధ్యలోనే నిలిచిపోయింది.

590 మందికిపైగా ..

జిల్లాల విభజన సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సర్దుబాటు, కేటాయింపుల కోసం జీఓ నంబర్ 317ను తీసుకొచ్చారు. కేడర్ స్ట్రెంత్, వర్కింగ్ పొజిషన్, వెకెన్సీ పొజిషన్, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగలకు సంబంధించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ కేటాయింపులు చేయాల్సి ఉంది. కానీ జిల్లాలో ఇవేవీ పట్టించుకోలేదు. నల్ల గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్, ఇత ర జిల్లాల నుంచి స్థానికేతరులను అడ్డదారుల్లో తీసుకొచ్చి ఇక్కడ నియమించారు. నిజానికి 2014 నాటికే జీఓ నంబర్ 610 ప్రకారం జిల్లాలో 590మంది స్థానికేతరులు ఉన్నట్లు గుర్తించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత స్థానిక జిల్లా కోటా 95 శాతం పెంచినప్పటికీ.. స్థానికేతరుల నుంచి మాత్రం విముక్తి లభించలేదు.



ఉపాధ్యాయ పోస్టుల మంజూరు, ఖాళీల వివరాలు

హోదా	పోస్టులు	పని చేస్తున్నవారు	ఖాళీలు
గ్రేడ్–2 హెడ్‌మాస్టర్	220	204	16
స్కూల్ అసిస్టెంట్స్	2,612	2,354	258
ఎస్‌జీటీ	3,693	3,449	244
మొత్తం	6,525	6,007	518

దక్కని ఉద్యోగ అవకాశాలు

ఒకవైపు స్థానిక ఉపాధ్యాయులకు పదోన్నతుల అవకాశాన్ని కోల్పోతుంటే.. మరోవైపు బీఈడీ, డీఈడీ కోర్సులు పూర్తి చేసిన 20 వేల మందికిపైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోతున్నాయి. జిల్లాలో 200 పైగా ఎస్జీటీ పోస్టులను స్థానికేతరులతో నింపారు. స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌లో 44 పోస్టులు ఖాళీగా ఉండాల్సి ఉండగా మూడు పోస్టులే కన్పిస్తున్నాయి. మిగిలిన పోస్టులన్నీ స్థానికేతరులతోనే నింపేశారు. విచిత్రమేమిటంటే స్కూల్ అసిస్టెంట్ సోషల్ టీచర్‌ను తీసుకొచ్చి ఎస్ఏ ఫిజికల్ సైన్స్ పోస్టులో నియమించారు. హైకోర్టు డబ్ల్యూపీ నంబర్ 28043/2023 తీర్పు ను అనుసరించి స్థానికేతరులను గుర్తించి, వారిని తిప్పి పంపాలి. అలా చే యకపోవడంతో స్థానికత ఉన్న ఉపాధ్యాయులు ప దోన్నతుల్లోనే కాదు బదిలీల్లోనూ తమకున్న అవకాశాన్ని కోల్పోయే ప్రమా దం లేకపోలేదు.

క్లుప్తంగా

19న బీజేపీ సన్మాన సభ

విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

అనంతగిరి: చేవెళ్ల పార్లమెంట్ నుంచి భారీ మెజారిటీతో గెలుపొందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అభినందన సభను ఈ నెల 19న వికారాబాద్‌లో నిర్వహిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సన్మాన సభ పట్టణంలోని కొండా బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శివరాజు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు యాస్కి శిరీష, నాయకులు పాండుగౌడ్, నందు, విజయభాస్కర్, సతీష్, రాములు, శ్రీకాంత్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఆర్యనగర్‌లో మున్సిపల్ చైర్మన్ పర్యటన



రోడ్డుపై నిలిచిన మురుగును పరిశీలిస్తున్న జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్: పట్టణంలోని పలు కాలనీల్లో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో చేపట్టాల్సిన పనుల గురించి స్థానికులకు వివరించారు. త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభం అవుతాయన్నారు. సీసీ రోడ్లు మురుగు కాల్వలు నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మునీర్, మురహరి వశిష్ట, నాగు తదితరులు పాల్గొన్నారు.

రైతుబిడ్డకు ఉన్నతోద్యోగం



స్రవంతి


దోమ: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన స్రవంతి టీజీపీఎస్సీ విడుదల చేసిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ ఫలితాల్లో సత్తాచాటి ఇరిగేషన్ శాఖలో (ఏఈఈ)ఉద్యోగానికి ఎంపిక అయ్యారు. గ్రామానికి చెందిన పట్లోళ్ల కృష్ణారెడ్డి, అమృతమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కృష్ణారెడ్డి తనకున్న వ్యవసాయం పొలంలో వివిధ పంటలను సాగు చేస్తూ కూతుళ్లను ఎంతో కష్టపడి ఉన్నత చదువులు చదివించారు. ఆడ పిల్లలు ఉన్నారని ఎక్కడా అధైర్యాన్ని కోల్పోకుండా వ్యవసాయం చేసుకుంటూ కూతుళ్లకు అండగా నిలబడ్డారు. మొదటి కుమార్తె శ్రావణి 2019లోనే పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం రాగా, రెండవ కూతురు స్రవంతి ఇటీవలే ప్రభుత్వం విడుదల చేసిన ఏఈఈ పరీక్ష ఫలితాల్లో సత్తాచాటి ఇరిగేషన్ విభాగంలో ఉద్యోగం సాధించారు. కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన స్రవంతిని గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలుపుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మాడ్గుల: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాడ్గుల సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఇర్విన్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ వగ్గ ఆనంద్, ఓనర్ పగడల రవిపై క్రిమినల్ కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

చివరి ఆయకట్టు.. నీరొస్తే ఒట్టు

- మరమ్మతులకు నోచుకోని కోట్‌పల్లి ప్రాజెక్టు
- ఐదు వేల ఎకరాలకే అందుతున్న సాగునీరు
- లీకేజీలతో ఆనవాళ్లు కోల్పోతున్న వైనం
- పునర్నిర్మాణం చేసి ఆదుకోవాలంటున్న అన్నదాతలు



కోట్‌పల్లి ప్రాజెక్టులో అడుగంటిన నీటి నిల్వలు

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు పునర్నిర్మాణ పనుల కోసం అన్నదాతలు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. గతంలోనే రూ.110 కోట్లతో ప్రాజెక్టు మరమ్మతులకు ప్రాతిపాదనలు ప్రభుత్వానికి పంపగా నేటికి నిధులు విడుదల కాలేదు. దీంతో ఈ సీజన్‌లో సైతం నీరు అందక ఆయకట్టు చివరి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. శాసనసభ స్పీకర్ సైతం త్వరలో ప్రాజెక్టు పనులకు నిధులు మంజూరు చేయిస్తానన్న హామీ కొంత ఉపశమనం కలిగిస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకే తలమానికమైన కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రతి సంవత్సరం వర్షా కాలంలో పూర్తిగా నిండినా చివరి సాగు భూములకు నీరు మాత్రం చేరడం లేదు. జిల్లాలోని ధారూరు, పెద్దేముల్ మండలాల రైతుల్లో 70 శాతం మంది రబీ పంటలపై ఏటా ఆశలు పెదులుకుంటున్నారు.

9,200 ఎకరాల ఆయకట్టు

కోట్‌పల్లి ప్రాజెక్టు లక్ష్యం 9,200 ఎకరాలు కాగా, దీనికి బేబీ కెనాల్‌తో పాటు కుడి, ఎడమ కాలువలున్నాయి. 1967లో ఈ ప్రాజెక్టును నిర్మించారు. కానీ ఏటా మరమ్మతులు చేయపోవడంతో ప్రాజెక్టు లక్ష్యం చేరుకోలేక పోతుంది. ముఖ్యంగా కాలువలు ధ్వంసమై, లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతుంది. 57 ఏళ్ల క్రితం ప్రాజెక్టును నిర్మించినా నేటికి చివరి భూములకు నీరు అందని పరిస్థితి దాపురించింది. మండలంలోని గట్టెపల్లి, రుద్రారం, గట్టెపల్లితండా, రాంపూర్‌తండా వరకు 11 కిలో మీటర్ల పొడవుతో ఎడమ కాలువను నిర్మించారు. దీనిలో అక్కడక్కడ లీకేజీలు ఏర్పడి సగం నీరు వృథాగా కాగ్నా నదిలో కలిసిపోతుంది. ఈ వృథా నీటితో 500 ఎకరాల భూమి బీడుగా మారుతోంది. ఈ కాలువ పరిధిలో 1,120 ఎకరాలకు నీరందాల్సి ఉండగా ప్రస్తుతం 600 ఎకరాలకు కూడా అందడం లేదు. ముఖ్యంగా మేకలోని వాడుక దగ్గర కాలువకు ఏర్పడిన లీకేజీతో నీరు వృథాగా పోతోంది. ప్రాజెక్టు వెనుక భాగంలో నిర్మించిన ఎడమ కాలువ తూము లోపభూయిష్టంగా ఉండటం గమనార్హం. తూము నిర్మాణం అస్తవ్యస్తంగా ఉండడంతో లీకేజీలు ఏర్పడి నీటి వృథాకు కారణమవుతోంది.

అధ్వానంగా కాలువలు

మండల పరిధిలోని నాగసమందర్, అల్లాపూర్ గ్రామాలతో పాటు పెద్దేముల్ మండలంలోని 7,720 ఎకరాలకు కుడి కాలువ ద్వారా పొలాలకు నీరు చేరాలి. కాలువ మొత్తం పాడైపోయి శిథిలావస్థకు చేరడంతో నీటి వృథా అధిక మొత్తంలో అవుతుందని రైతులు వాపోతున్నారు. ఈ కాలువ పొడవు దాదాపు 24 కిలోమీటర్లు కాగా ప్రతీ కిలోమీటర్‌కు 10 వరకు కాలువల్లో లీకేజీలున్నాయి. కాలువలలో ఏర్పాటు చేసిన షెట్టర్లు పూర్తిగా దెబ్బతిన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ కాలువ ద్వారా వృథా అవుతున్న నీటికి అడ్డుకట్ట వేస్తే దాదాపు 3 వేల ఎకరాలకు సాగు నీరందే అవకాశం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

> **ప్రతిపాదనలు పంపాం**
>
> ప్రాజెక్టును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలంటే రూ.110 కోట్ల నిధులు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాం. ప్రాజెక్టు కాలువల కింద సీసీ బెడ్స్, వాటికి గైడ్‌వాల్స్ నిర్మిస్తేనే ప్రాజెక్టులోని చివరి భూములకు నీరు అందుతుంది. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడుతాం.
>
> – సుందర్, ఇన్‌చార్జి, ఎస్‌ఈ

పాడైన షట్టర్లు

బూర్గుగడ్డ ప్రాంతంలోని 360 ఎకరాల పొలాలకు నీరందించడానికి 1.6 కిలో మీటర్ల పొడవుతో బేబీ కెనాల్‌ను నిర్మించారు. ఈ కాలువ కూడా లీకేజీలతో ప్రవహిస్తూ కాగ్నాలో చేరుతుంది. అలాగే ఎడమ కాలువ తూము పాడై ప్రాజెక్టు నీరు లీకేజీ రూపంలో మేకలోని వాడుకలో కలిసి వెళుతోంది. ఎడమ, బేబీ కెనాల్ తూముల షట్టర్‌లు పైకి లేపితే కిందకు దిగదు, కిందకు దింపుతే పైకి లేవదని రైతులు వాపోయారు. ఈ విషయం సాగునీటి అధికారులకు తెలిసినా మరమ్మతులు చేయించలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి కోట్‌పల్లి ప్రాజెక్టుకు మరమ్మతులు చేయాలని స్థానిక కర్షకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మంబాపూర్‌లో కూలిపోయిన కుడి కాలువ షట్టర్



కుడి కాలువలో పేరుకుపోయిన మొక్కలు

బైక్‌లు ఢీ.. ఒకరి మృతి

మరొకరి పరిస్థితి విషమం

- ఇద్దరికి గాయాలు

ఆమనగల్లు: పట్టణ సమీపంలోని మాడ్గులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట మూడు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం నాయక్, స్థానికుల కథనం ప్రకారం.. వెల్దండ మండలం అజిలాపురానికి గ్రామానికి చెందిన సల్వాజ్‌యాదయ్య(45), రాఘాయిపల్లికి చెందిన రాయికంటి యాదగిరి ఇద్దరు బావ బామరుదులు. వీరు బైక్‌పై అజిలాపురం నుంచి ఆమనగల్లు వైపు వస్తుండగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ఆమనగల్లుకు చెందిన లండం శివ బైక్‌పై సడన్‌గా రోడ్డుపైకి రావడంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఇదే సమయంలో ఎర్రబీకృతండాకు బైక్‌పై వెళ్తున్న ఇస్లావత్ రోజ బైక్‌లను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సల్వాజీ యాదయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన రాయికంటి యాదగిరిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. గాయపడిన శివ, రోజలను ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. యాదయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాం నాయక్ పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని పుర్సంపల్లిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం.. దోమ మండలం మోత్కూరు గ్రామానికి చెందిన ఎడ్ల మల్లేష్, శ్రీనులు మరికల్.. కుల్కచర్ల మీదుగా దోమ మండలానికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో చౌడాపూర్ మండలం పుర్సంపల్లి గ్రామపంచాయతీ గేటు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కిందపడి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వీరిని వైద్య చికిత్సల నిమిత్తం కుల్కచర్లలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

పశువులను తరలిస్తున్న వాహనం సీజ్

ధారూరు: పశువులను విక్రయించేందుకు వాహనంలో తరలిస్తుండగా పోలీసులు సీజ్ చేసి ధారూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొంరాస్‌పేట్ మండలంలోని బురాన్‌పూర్ గ్రామానికి చెందిన చిప్పె శ్రీకాంత్ ధారూరుకు చెందిన అబ్దుల్ అలీంకు పశువులను రూ.50 వేలకు ఖరీదు చేసి బొలేరో వాహనంలో తరలిస్తున్నారు. ధారూరు సమీపంలోకి రాగానే పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా అందులో ఓ ఆవు, మూడు లేగదూడలు కన్పించాయి. డ్రైవర్ సుభాన్ ఖురేషిని అదుపులోకి తీసుకుని వాహనాన్ని పీఎస్‌కు తరలించారు. వీటిని వికారాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లు డ్రైవర్ పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



షబానబేగం (ఫైల్)

ధారూరు: ఇంట్లో నిద్రిస్తున్న మహిళ తెల్లవారేసరికి కనబడకుండా పోయింది. ఈ సంఘటన ధారూరులో వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మోమిన్‌కలాన్ గ్రామానికి చెందిన తారబీ, లాకత్‌అలీల కూతురు షబానబేగం(40)కు వికారాబాద్‌కు చెందిన తాజుద్దీన్‌తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. భార్యాభర్తల మధ్యన విభేదాలు రావడంతో గత నెలలో షబాన తల్లిగారి ఇంటికి వచ్చింది. ఈనెల 13న తల్లితో కలిసి నిద్రించిన షబాన ఉదయం కనిపించకుండా పోయింది. భర్త, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆదివారం ధారూరు పోలీసులకు తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ నాయకుల డిమాండ్

శంషాబాద్ రూరల్ : మండలంలోని మదన్‌పల్లి రెవెన్యూ పరిధిలోని చెరువులు, కుంటల కబ్జాను అరికట్టి, ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఆదివారం ఆయా ప్రాంతాలను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. సర్వే నెంబరు 37లో 47 ఎకరాల విస్తీర్ణం ఉన్న నల్లచెరువును రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కార్పొరేట్ సంస్థలు కబ్జా చేస్తున్నాయని వారు ఆరోపించారు. అదే విధంగా సర్వే నెంబర్ 8లో గర్వోనికుంటను కూడా కబ్జా చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, రియల్టర్లు కలిసి అధికారులతో కుమ్మక్కై జల వనరులను ధ్వంసం చేశారన్నారు. చెరువులు, కుంటలను ఆనుకుని భారీగా ప్రహరీ నిర్మాణాలు చేపట్టారన్నారు. కబ్జాలు చేయడమే కాకుండా నీటి వరదకు అడ్డుకట్ట వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలను అడ్డుకునేందుకు కబ్జాల గురించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. అధికారులు ఇప్పటికైనా కబ్జాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరేందర్, నర్సింహ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యానోడల్ అధికారిగా పర్వతాలు



నియామకపత్రం అందజేస్తున్న ఎంపీపీ పద్మారెడ్డి

మాడ్గుల: మాడ్గుల మండల నోడల్ విద్యా అధికారిగా ఇర్విన్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పర్వతాలు నియమితులయ్యారు. ఈ మేరకు మండల ఎంపీపీ పద్మారెడ్డి, ఏఈఓ సర్దార్ నాయక్‌లు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యాతో పాటు మధ్యాహ్న భోజనం అందించడానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని పర్వతాలు కోరారు.

మనవరాలి కోసం కొన్న బంగారం చోరీ

సీసీ కెమెరాలో రికార్డు

షాద్‌నగర్‌రూరల్: తన మనవరాలికి పెడదామని ఓ వృద్ధురాలు బంగారం కొనుగోలు చేసింది. ఆమెను అనుసరించిన దొంగలు ఆమె వద్ద బంగారాన్ని కొట్టేశారు.. ఈ ఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి...మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం సూరారం గ్రామానికి చెందిన భారతమ్మ(వృద్ధురాలు) తన మనవరాలి శుభకార్యంలో బంగారం పెట్టాలనుకుంది. ఓ జ్యువెలరీ షాపులో బంగారం కొనుగోలు చేసి బ్యాగులో పెట్టుకుంది. తరువాత సమీపంలో ఉన్న లేడీస్ కార్నర్‌కు వెళ్లింది. బంగారాన్ని గమనించిన ఇద్దరు గుర్తు తెలియని మహిళలు ఆమెను అనుసరించి లేడీస్ కార్నర్‌లోకి వెళ్లారు. చాకచక్యంగా బ్యాగులో ఉన్న బంగారాన్ని దొంగిలించారు. కొంత సేపటికి చూసుకున్న భారతమ్మకు బ్యాగులో పెట్టుకున్న బంగారం కనిపించలేదు. దీంతో ఆయా షాపుల్లోని సీసీ కెమెరాల్లో ఇద్దరు మహిళలు భారతమ్మను అనుసరించి బంగారం దొంగిలించినట్లు కొన్ని దృశ్యాలు రికార్డు అయ్యాయి. మనుమరాలికి పెడదామని తీసుకున్న బంగారాన్ని దొంగిలించడంతో భారతమ్మ కన్నీరుమున్నీరయింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఐదు నిమిషాల్లో వస్తానని..

- అంతలోనే విషాదం
- రోడ్డు ప్రమాదంలో మేస్త్రీ దుర్మరణం



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తాండూరు రూరల్: ఐదు నిమిషాల్లో ఇంటికి వస్తాను.. అన్నం, రొట్టెలు చేయండి.. అని భార్యకు చెప్పిన ఓ భవన నిర్మాణ కార్మికుడు(మేస్త్రీ) మృత్యువడికి చేరాడు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఆ కుటుంబం కకావికలం అయింది. ఈ విషాద సంఘటన తాండూరులోని అంతారం శివారు బైపాస్ రోడ్డుపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. పెద్దేముల్ మండలం కందనెల్లి తండాకు చెందిన శ్రీనివాస్(37) భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఆయన తాండూరు పట్టణంలో పనులు ముగించుకొని బైక్‌పై తిరిగి ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో అంతారం శివారులోని బైపాస్ రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో లారీ టైర్ శ్రీనివాస్ తల భాగంపై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జు అయింది. ఈ విషయాన్ని స్థానికులు తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌కు తెలిపారు. దీంతో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. శ్రీనివాస్‌ను ఢీకొట్టిన లారీ తాండూరు పట్టణానికి చెందినదిగా గుర్తించారు. ప్రమాదం జరగడంతో లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాస్‌కు భార్య ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. సంఘటనాస్థలానికి భార్య గోరీబాయి చేరుకొని గుండెలవిసేలా విలపించారు. ఐదు నిమిషాల్లో ఇంటికి వస్తానన్న మనిషి ఇలా.. విగతజీవిగా ఉండటాన్ని ఆమె జీర్ణించుకోలేక పోయింది. గుమిగూడిన జనాలు సైతం విచారాన్ని వ్యక్త పరిచారు.

న్యాయం చేయాలని ఆందోళన

మృతి చెందిన శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్తులు రోడ్డుపై మృతదేహంతో బైఠాయించి ఆందోళన చేశారు. మృతికి కారకులైన లారీ డ్రైవర్‌ను శిక్షించడంతో పాటు శ్రీనివాస్ కుటుంబానికి పరిహారం చెల్లించాలని నిరసన తెలిపారు. స్థానిక ఎస్‌ఐ కాశీనాథ్ ఘటనాస్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న బంధువులతో మాట్లాడి సముదాయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బక్రీద్‌కు సిద్ధమైన ఈద్గాలు



కొడంగల్: ఈద్గాను పరిశీలిస్తున్న చైర్మన్



దుద్యాల్: ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమవుతున్న ఈద్గా

జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఏర్పాట్లు

కొడంగల్: ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే పండుగలలో బక్రీద్(ఈద్-అల్-అదా) ఒకటి. ఈ పండుగను త్యాగానికి ప్రతీకగా వారు భావిస్తారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం చివరి నెల జిల్ హిజ్జ. ఆ నెలలో 10వ రోజున బక్రీద్‌ను ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటారు. అల్లాహ్ ఆజ్ఞను తుచా తప్పకుండా పాటించడమే ఈ పండుగ అర్థం. సోమవారం బక్రీద్‌ను జరుపుకోవాలని మత పెద్దలు ప్రకటించారు. ఈ వేడుకకు జిల్లా వ్యాప్తంగా ఈద్గాలు, ప్రార్థన మందిరాలు ముస్తాబయ్యాయి.

మున్సిపల్ చైర్మన్ సందర్శన

పట్టణంలోని ఈద్గా ప్రాంగణాన్ని కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గాను ఆయన సందర్శించారు. ఈద్గా ప్రాంతాన్ని శుద్ధి చేయాలని మున్సిపల్ కార్మికులకు సూచించారు. ఈద్గాకు వెళ్లడానికి సీసీ రోడ్డు వేయాలని ముస్లింలు కోరగా త్వరలో పనులు ప్రారంభం అయ్యే విధంగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఎస్‌ఎమ్ గౌసన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు ఆసీఫ్‌ఖాన్, కో ఆప్షన్ సభ్యుడు మునీర్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు: ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తదితరులు

ప్రశాంతంగా జరుపుకోవాలి

తాండూరు: పట్టణ శివారులో ఉన్న ఈద్గా మైదానాలను ఆదివారం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా బక్రీద్ పండగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు వచ్చే ముస్లిం మతస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన భద్రతా అంశాలను సీఐలకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రశాంతమైన వాతావరణంలో పండగ జరుపుకోవాలని మత పెద్దలను కోరారు.

ఎక్సైజ్‌శాఖ అధికారుల దాడులు

బెల్లం పానకం ధ్వంసం



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న అధికారులు

కడ్తాల్: గుడుంబా రహిత తెలంగాణే లక్ష్యంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం, కడ్తాల్, మాడ్గుల మండలాల పరిధిలోని పల్లెచెలకతండా, ముద్వీన్, ఎక్వాయిపల్లి, నాగిళ్ల, నల్లచెలక తండాల్లో ముమ్మరంగా దాడులు చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ బద్యానాథ్ చౌహాన్ తెలిపారు. పల్లెచెలక తండా సమీపంలో 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు, గుట్టల ప్రాంతంలో మరో 40 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. నల్లచెలక తండాలో రెండు లీటర్ల సారాను సీజ్ చేసి తండాకు చెందిన లస్కర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిషేధించిన నాటు సారా తయారు చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు స్వప్న, శంకర్ హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుల్ సురేశ్ ఉన్నారు.

కామాంధుడిని కఠినంగా శిక్షించాలి

సోషలిస్ట్ సమాజ్‌పార్టీ వ్యవస్థాపకుడు పురుషోత్తం



బడంగ్‌పేట్: పెద్దపల్లి జిల్లాలో ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సోషలిస్ట్ సమాజ్‌పార్టీ వ్యవస్థాపకులు బోద్రమోని పురుషోత్తం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కట్నాపల్లి గ్రామ శివారులోని ఓ రైస్ మిల్లులో పనిచేస్తున్న తల్లిదండ్రులు అక్కడే ఉన్న రేకుల షెడ్డులో ఉంటున్నారు. వర్షం వచ్చి కరెంట్ నిలిచిపోవడంతో బయట ఇద్దరు పిల్లలతో కలిసి నిద్రించగా ఆరేళ్ల చిన్నారిని బీహార్‌కు చెందిన ఉన్మాది వినోద్ మాజే(28) అపహరించి అత్యాచారానికి పాల్పడి, హత్య చేశాడని మండిపడ్డారు. ఉన్మాదులను వదిలిపెట్టకుండా వెంటనే అరెస్ట్ చేసి ఉరితీయాలన్నారు. బాధిత చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం రూ.50 లక్షలు ఆర్థిక పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.ఝాన్సీ, సహాయ కార్యదర్శి భానుప్రసాద్, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి సుజాత, విజయ, నాగేంద్రమ్మ, సంధ్యారాణి, జి.కృష్ణ, లక్ష్మణ, నారాయణ, శేఖర్, గోవింద్ నాయక్, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై ఏపీఎం వేధింపులు !

- సోషల్ మీడియాలో చక్కర్లు
- చర్యలు తీసుకోవాలంటూ స్థానికుల డిమాండ్

కొందుర్గు: మహిళల అభ్యున్నతికి విధులు నిర్వహిస్తున్న ఓ ఏపీఎం మహిళలను వేధింపులకు గురిచేస్తున్న ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో వెలుగులోకి వచ్చింది. మండల మహిళా సమాఖ్యలో విధులు నిర్వహిస్తున్న ఏపీఎం రామస్వామి మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు, మహిళా వీఓఏలను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పలువురికి చాటింగ్ చేసి బెదిరించినట్లు టెక్ట్స్ మేసేజ్‌లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ విషయం బయటికి వెల్లడించడానికి బాధితులు సుముఖత చూపడం లేదు.

కఠినంగా శిక్షించాలి

మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరించిన ఏపీఎం రామస్వామిని కఠినంగా శిక్షించాలని తుమ్మలపల్లి ఎంపీటీసీ రజిత, బీజేపీ నాయకులు సుధాకర్‌రావు వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. తక్షణమే అతడిని విధుల్లోనుంచి సస్పెండ్ చేసి, పూర్తి విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని కోరారు.

ఏపీఎం వివరణ..

దీనిపై ఏపీఎం రామస్వామిని వివరణ కోరగా రెండు రోజులక్రితం తన ఫోన్ హ్యాక్ చేశారని, ఎలాంటి పొరపాటు చేయలేదని వెల్లడించారు.